www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

మండపేట సిఐగా షేక్ అఖిల్‌జమ

ప్రజాశక్తి-మండపేట

మండపేట టౌన్ సిఐగా షేక్ అఖిల్ జమ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్ కి చెందిన ఈయన గతంలో కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాలో సీఐగా పనిచేశారు. ఆయన బదిలీపై రాజమహేంద్రవరం నుంచి మండపేట టౌన్ సీఐగా వచ్చారు. ఆయన ఆదివారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఐ అఖిల్ జమ మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు. టౌన్ లో ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి నేరాల అదుపునకు కృషి చేస్తామని చెప్పారు.

షేక్ అఖిల్ జమ,సిఐ

ఐక్యతతో ప్రజా వ్యతిరేక పాలనకు అడ్డుకట్ట

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు
- 27,28 తేదీల్లో విజయవాడలో మహాధర్నాపై జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-అమలాపురం

ఐక్యతతో ప్రజా వ్యతిరేక పాలనకు అడ్డుకట్ట వేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక సామాన్య ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడ మహా ధర్నా జయప్రదం చేయాలని అమలాపురం యుటిఎఫ్ హోం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వరంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గాప్రసాద్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతులు, కార్మికులు సామాన్య ప్రజలకు కష్ట నష్టాలను కలిగించుతూ పాలన సాగుస్తున్నారన్నారు. దీని అడ్డుకట్ట వేయడం కోసం ప్రజలందరూ కూడా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని అధిగమించటానికి రైతులు ఆత్మహత్యలు నివారించడానికి వ్యవసాయ గిట్టుబాటు రైతు తన కుటుంబంతో ఆత్మగౌరవంతో మనగలడానికి పంటకు సమగ్ర పంట ఉత్పత్తి వ్యాయామానికి 50 శాతం అదనంగా కలిగి చట్టబద్ధ కనీసం నిర్ణయించవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఎలక్ట్రిసిటీ బిల్ పాస్ కానప్పటికీ అడ్మినిస్ట్రేటివ్ ఉత్తరల ద్వారా ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో 71 లక్షల మీటర్లను బిగించేసింది.2025-26 నాటికి మొత్తం 25 కోట్ల మీటర్లు బిగించడానికి లక్ష్యం సిద్ధం చేసిందన్నారు. బిజెపి పాలిత రాష్ట్ర ల్లో సహ అనేక రాష్ట్రాల్లో ఈ మీటర్లు బిగింపు వ్యతిరేకిస్తూ ఉండగా మోడీ మెప్పు కొరకు ఆంధ్రప్రదేశ్లో జగన్ ప్రభుత్వం ఈ సంవత్సరమే10 లక్షలు వ్యవసాయ పంపు చెట్లకు ప్రభుత్వ కార్యాలయంలో స్మార్ట్ మీటర్లు బిగింప చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో 20 లక్షల మంది కౌలు రైతులు ఉండగా సుమారు 7 లక్షల మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇవ్వబడ్డాయని గుర్తింపు కార్డు లేక కొన్ని పథకాలు కౌలు రైతులు కోల్పోతున్నారని అన్నారు. పలు దశాబ్దాలుగా సంఘటిత పోరాటాలు పర్యావసానంగా కార్మికులకోసం సాధించుకున్న హక్కులను భంగం కలిగిస్తూ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి పారిశ్రామికవేత్తలకు అధిక లాభాలను చేకూర్చేలా మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండానే లేబర్ కోర్టులను పార్లమెంట్లో పాస్ చేసిందన్నారు. రోజు పనిగంటలో 8 గంటల పనితో పరిమితం చేయవలసి ఉండగా ఇప్పుడు 12 గంటల వరకు పనిగంటలు పరిమితులు పెంచింది.కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. అసంఘటిత రంగం కార్మికుల రిజిస్ట్రేషన్ చేసి వారికి పెన్షన్ సామాజిక బాధ్యత కల్పించాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు ఇసుక సరఫరాచేయాలన్నారు. సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఈ శ్రమ పోర్టల్ నమోదుచేసుకున్న హమాలీ, కొబ్బరి ఒలుపు దింపు ప్రమాదరంగం కార్మికులందరికీ ఆరోగ్య పథకాలు, జీవిత భీమా అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి పీతల రామచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సికిలే సూర్యనారాయణ, ఆశ వర్కర్ యూనియన్ నాయకులు ఎస్తేరు వివిధ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కేంద్రం కర్షక -కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వేసిన బుక్లెట్‌ను ఆవిష్కరించారు.

అమలాపురం యుటిఎఫ్‌లో జరిగిన సదస్సులో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, ఇతర నాయకులు

పాత రైల్వే లైన్ కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

కోటిపల్లి -నరసాపురం రైల్వే లైన్ నిమిత్తం గతంలో సర్వే చేసిన పాత రైల్వే లైను కొనసాగించాలని కోరుతూ బోడసకుర్రు గ్రామ ప్రజలు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమలాపురం ఎంపీ చింత అనురాధకు బోడసకుర్రు గ్రామంలో ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. పాత రైల్వే లైన్ నిర్మాణం కోసం గతంలో భట్నవిల్లి, పేరూరు, తొట్లపాలెం గ్రామాల మీదుగా రైల్వే లైన్‌కు సర్వే చేశారన్నారు. కొత్తగా బోడసకుర్రు గ్రామం తొట్లపాలెం మీదుగా రైల్వే లైన్ కు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఈ రైల్వే లైను నిర్మాణం వలన బోడసకుర్రు గ్రామంలో నివాస గహాలు, విలువైన భూములు కోల్పోతున్నామన్నారు. గతంలో సర్వే చేసిన పాత లైను కొనసాగించాలని ఎంపీ అనురాధ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బోడసకుర్రు గ్రామ కమిటీ ప్రెసిడెంట్ మట్టపర్తి షణ్ముఖరావు, రొక్కాల నాగేశ్వరరావు, దొమ్మేటి రాధాకష్ణ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఎంపీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్, గ్రామ మహిళలు

రహదారుల దుస్థితిపై నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో ఆదివారం .గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది కార్యక్రమం ఆది వారం నిర్వహించారు. టిడిపి, జనసేన నాయకులు రహదారుల దుస్థితిపై నిరసన తెలిపారు.

రామచంద్రపురం గుంతల రాజ్యానికి దారేది అంటూ నియోజకవర్గం లోని టిడిపి, జనసేన పార్టీలు ఉమ్మడిగా ద్రాక్షారామ మెయిన్ రోడ్డుపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాడైపోయిన రోడ్ల దుస్థితి పై తాళ్ళపొలం నుంచి ద్రాక్షారామ వరకు పాదయాత్ర చేసి నాయకుల కళ్ళు తెరిపిస్తాం అన్నారు. తెలుగుదేశం- జనసేన పార్టీ ల ఉమ్మడి సారథ్యంలో గుంతల ఆంధ్రాకు దారేది కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలోనీ వెల్ల వంతెన నుండి ద్రాక్షారామ వెళ్లే రోడ్డుపై, తాళ్ళపొలం నుండి ద్రాక్షారామ వరకు సుమారు 4 కిలోమీటర్లు దూరం నడచి అనంతరం విలేకరులతో మాట్లాడారు. జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ .అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో కొత్త రోడ్లు వేయకపోగా గుంతలు పడిన రోడ్లకు కనీసం మరమత్తులు కూడా చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు జనసేన, టిడిపిలు ఉమ్మడిగా ఆదివారం ఈదరాడ -జగ్గన్నపేట రోడ్ లో నిరసన కార్యక్రమం చేశారు. కార్యక్రమం లో బొంతు రాజేశ్వరరావు, జాలెం శ్రీనివాస రాజా, తోట త్రిమూర్తులు, మేకల యేసుబాబు, పరసా సుజాత తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** గుంతల ఆంధ్ర ప్రదేశ్ కు దారేది కార్యక్రమంలో భాగంగా ఉప్పలగుప్తం-ఎన్.కొత్తపల్లి ప్రధాన రహదారిపై అమలాపురం నియోజకవర్గం టిడిపి,జనసేన పార్టీల ఇన్ ఛార్జ్ లు అయితాబత్తుల ఆనందరావు, శెట్టిబత్తుల రాజబాబు లు తమ తమ పార్టీల నాయకులతో ఆందోళనకు దిగారు. ఉప్పలగుప్తం-ఎన్. కొత్తపల్లి ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే నాలుగన్నరేళ్ల గా వైసిపి ప్రభుత్వం ఏమి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబు, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జెడ్పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు రవణం మధు, చిక్కం ఉమేష్ గాలిదేవర సురేష్ జనసేన నాయకులు సందాడి శ్రీను, ఆకుల బుజ్జి, చిక్కం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ మెయిన్ రోడ్డుపై టిడిపి, జనసేన నాయకుల నిరసన

యుటిఎఫ్ ఆలమూరు మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఆలమూరు

యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించడం జరిగిందని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు వై.వి.వి.రమణ ఆదివారం తెలిపారు. మరొకసారి ఆలమూరు మండల శాఖ అధ్యక్షుడిగా అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జె.మనోజ్ కుమార్ ఎంపికయ్యారు. అలాగే మిగిలిన సభ్యులందరూ కూడా పాత కార్యవర్గమే ఎన్నుకొన్నారు. అయితే కొంతమంది బదిలీ మీద వెళ్లిన కారణంగా వారి స్థానంలో మండలానికి వచ్చినటువంటి వసంత్ ,ఆనంద్ లను కూడా కార్యవర్గంలో తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఆలమూరు మండల యుటిఎఫ్ శాఖ నూతన బిల్డింగు నిర్మించాలని మండల శాఖ తీర్మానించింది. అందుకు అనుగుణంగా కొంతమంది సభ్యులు విరాళాలు ప్రకటించగా వారందరికీ కూడా మండల శాఖ ప్రత్యేకమైన ధన్య వాదాలు తెలియజేసారు. అనంతరం మండల విద్యా శాఖ అధికారులు పి.సాలెంరాజు, పి.సుబ్బరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి బస్, ఎన్నికాధికారి బాలాజీలను గౌరవించి సత్కరించారు. అలాగే సహకారాన్ని అందించిన ఈదర రమేష్ ,అఖిల దంపతులకు, జి.జె.పుత్రకుమార్ కు మండల శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

పేదలకు ఆసరాగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి -మామిడికుదురు

నిరుపేదలకు ఆపద సమయంలో సిఎం సహాయనిధి ఆసరాగా నిలుస్తుందని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. నగరం క్యాంపు కార్యాలయంలో ఆదివారం గంగలకుర్రు అగ్రహారం మాజీ సర్పంచ్ పులిదిండి ఏడుకొండలు భార్య మంగాదేవికి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరయిన రూ.లక్షచెక్కును ఎంఎల్ఎ అందజేశారు. కార్యక్రమం లో ఎం ఎల్ఎ తనయుడు కొండేటి వికాస్, తదితరులు పాలుగున్నారు.



బోళ్ల వెంకటరమణను సత్కరిస్తున్న దృశ్యం

పిఠాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకునిగా బోళ్ల

ప్రజాశక్తి-రాజోలు

టిడిపి పిఠాపురం నియోజకవర్గ పరిశీలకులుగా రాజోలు పట్టణానికి చెందిన బోళ్ళ వెంకటరమణ నియమితులయ్యారు. ఆదివారం పిఠాపురంలో వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం నియోజక వర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు సమక్షంలో వెంకటరమణ పిఠాపురం పరిశీలకునిగా బాధ్యతలు చేపట్టారు. వెంకట రమణ మాట్లా డుతూ టిడిపి పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు. వెంకటరమణను రాజోలు మాజీ ఎంఎల్ఎ సూర్యారావు అభినంది ంచారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ ప్రధాని ఇందారాగాంధీ జయంతిని జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు పూలమాలులు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అల్లవరం మండలం బెండమూర్లంక మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర్ రావు, పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ ముఖ్య అతిథుగా విచ్చేసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కేకు కటింగ్ చేసి 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రభాకరరావు మాట్లాడుతూ ఇందిరాగాంధీ గరీబ్ హఠావో అనే నినాదంతో పేదరిక నిర్మూలన కోసం ఎంతో కషి చేశారన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, ఎఐసిసి కోఆప్షన్ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, అల్లవరం మండలం అధ్యక్షులు సాధనాల చిన సత్యనారాయణ పట్టణ అధ్యక్షులు వంటేద్దు బాబి, పెల్ల సుబ్రహ్మణ్యం, జిల్లా బిసి డిపార్ట్మెంట్ అధ్యక్షులు కుడుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** ఇందిరమ్మ సేవలు చిర స్మరణీయమని మండల కాంగ్రెస్ గెడ్డం అధ్యక్షుడు గెడ్డం వెంకటేశ్వరరావు అన్నారు. మామిడికుదురు సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి ఆదివారం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నీతిపూడి బాల సత్యనారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, మంచాలరామ కష్ణ, వాకపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు అధ్యక్షతన ఆదివారం భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెం లో ఇందిరా గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

భట్టుపాలెంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

గ్రంథాలయాల్లో వివిధ పోటీల నిర్వహణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆదివారం వక్తృత్వ, ముగ్గులు పోటీలు నిర్వహించారు. మాజీ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పలుచోట్ల ఆమె చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

అమలాపురం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి, మహిళా సాధికారికత పై జరిగిన సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎస్‌ఎన్‌ఎస్‌వి.ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగ ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు, సామాజిక కార్యకర్త జల్లి సుజాత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మెహబూబ్ షకీలా, సాయి సంజీవని మహిళా ఆరోగ్య సంస్థ సహాయ కార్యదర్శి అడబాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారిని డి.శివకుమారి ఆధ్వర్యంలో జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. తొలిత అంతర్జాతీయ మహిళా దినోత్సవంసందర్భంగా మాజీ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ రంగవల్లులు పోటీలను గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం , మహిళా ఉపాధ్యాయురాలు ప్రారంభించారు. జూనియర్స్ సీనియర్స్ విభాగాల్లో 45 మంది విద్యార్థులు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకరాలు డి శివకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు. **రామచంద్రపురం** రామచంద్రపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. జి.మౌనిక ముఖ్య అతిథి గా పాల్గొని మహిళా హక్కులు తదితర అంశాలపై ప్రసంగించారు. **ఆత్రేయపురం** గ్రంథాలయంలో విద్యార్థులకు సీనియర్స్ జూనియర్స్ విభాగంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు కార్యక్రమానికి. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ప్రసాద్ ,విశ్రాంత ఉపాధ్యాయులు కల్లేపల్లి రత్నంరాజు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. **మామిడికుదురు** సానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించినట్టు నిర్వాహకుడు కె. సూర్యనారాయణ తెలిపారు.

కపిలేశ్వరపురంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శంకుస్థాపన కార్యక్రమంలో తోట తదితరులు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -మండపేట

మెర్నిపాడులో అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆగ్రామ సర్పంచ్ గారపాటి అశోక్ కుమార్ సౌజన్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఆదివారం ఎంఎల్‌సి తోట శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అశోక్ చేస్తున్న కృషి అభినం దనీయమన్నారు. గ్రామ అభివద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమం లో మండల రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, పిల్లా సురిబాబు గ్రామ పెద్దలు ముత్యాల సత్యనారాయణ, మద్దిపూడి వెంకటరావు, వల్లూరి రాజు, బొజ్జ సుబ్బారావు, గుణ్ణం బొజ్జి య్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి -ఐ.పోలవరం

కాకినాడ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ఐ.పోలవరం మండలం బైరవపాలెం గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న పెమ్మాడి ధన శేఖర్, బాలిక విభాగంలో ఎన్.కుమారి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అండర్-14 విభాగంలో ఎంపికయ్యారని, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంవిఎస్ఎన్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థులు నవంబర్ 19, 20, 21 తేదీల్లో చిత్తూరు జిల్లాలోని బంగారుపాలెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్నారని అన్నారు. హెచ్ఎం విద్యార్థులతో పాటు పీడీ షేక్ మహాబుబా షరీఫ్‌ను అభినం దించారు. ఈ విషయాన్ని విద్య కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలకు తెలియజేశామన్నారు.

బెట్టింగులకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి -ఆలమూరు

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన అసాంఘిక కార్యకలాపాలపై ప్రకటన విడుదల చేశారు. క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా కొంత మంది బెట్టింగ్ ఆడడాలు ఆ బెట్టింగ్ ఆడి చాలా ఆస్తులు పోగొట్టుకోవడాలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులకు గురై కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసు వారికి తెలియజేయాలని ఆయన కోరారు. బెట్టింగులు, నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు చేస్తే బండ్లు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కూడా మంచిగా ఉండాలని పోలీసులకు సహకరించాలని కోరుతున్నామన్నారు.

వెంకటప్రసాదరావును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం స్పెషల్ కోర్టు జడ్జికి అభినందనలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అమలాపురం స్పెషల్ కోర్టు నూతన జడ్జిగా అంబాజీపేట వాసులు పులిదిండి వెంకట ప్రసాదరావు నియామకం పట్ల మండల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఆయన అడ్వకేట్‌గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా, జడ్జిగా అనేక సేవలు చేసి జడ్జిగా పదవీ విరమణ చేసిన తర్వాత కూడా రాష్ట్ర హైకోర్టు స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్‌గా ప్రసాదరావు ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈయన తండ్రి నాగభూషణం కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నెల్లి వెంకట రమణ, మహమ్మద్ ఆరిఫ్, మహ్మద్ ఇస్మాయిల్, ఆదుర్తి నారాయణ మూర్తి, పాల్గొన్నారు.

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ఈనెల 20 సోమవారం యథావిధిగా కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు ఉదయం 10 గంటల నుంచి జిల్లాస్థాయి అధికారులతో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. జిల్లాస్థాయి సమస్య లను అర్జీదారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమం దృష్టికి తెచ్చి పరిష్కార మార్గాలు కోరాలన్నారు.

కార్టూ'నిజం'

నైతిక విలువలేవ్వేలు.. ఏ కమిటీలో వున్నాడంటావా? ఎథిక్స్ కమిటీలో...

జనసేన టిక్కెట్ రేసులో యువ నాయకుడు

- రాజోలు సీటును ఆశిస్తోన్న డాక్టర్ బాబు

టిడిపి, జనసేన పొత్తుతో ఇక జగన్ పని అయిపోయిందని రెండు పార్టీల కార్యకర్తలు భావిస్తుం డగా.. కొందరు నాయకుల్లో మాత్రం ఈ పొత్తుపై ఆం దోళన రేకెత్తుతోంది. ఇప్పటి వరకు టిడిపి, జనసేన పార్టీల నుంచి టిక్కెట్ ఆశించిన అభ్యర్థులు పొత్తులో భాగంగా తమకు మొండిచేయి మిగులుతుందని కల వరపడుతున్నారు. రాజోలు నియోజకవర్గంలో రెండు పార్టీల నేతల పాటు కార్యకర్తల్లో సందిగ్ధత నెలకొంది.

ప్రజాశక్తి-రాజోలు

ఎపిలో అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడు తోంది. గత ఎన్నికల్లో టిడిపి, వైసిపి, జనసేన పార్టీల మధ్య త్రిముఖ పోరు జరగగా.. ఈసారి మాత్రం టిడిపి, జనసేన పొత్తుతో వారి నుంచి ఒకరు వైసిపి నుంచి ద్విముఖ పోరు జరగనుంది. రాజోలు నియోజకవర్గంలో జనసేన పోటీ చేస్తుందని ఇప్పటికే పవన్ కళ్యాణ్ ప్రకటించారు. దీంతో జనసేన పార్టీ తరపున టికెట్లు ఆశించేవారి సంఖ్య భారీగానే ఉంది. ఈ జాబితాలో రాజోలు నియోజకవర్గంలో యువ నేత డాక్టర్ రాపాక రమేష్ బాబు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

డాక్టర్ రమేష్ బాబు

రేసులో డాక్టర్ బాబు!

రాష్ట్రంలో 2019 ఎక్కడా గెలవని జనసేన పార్టీ కేవలం రాజోలు నియోజకవర్గంలో మాత్రమే గెలిచింది. గెలిచిన ఒక్క ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు పార్టీని వీడి వైసిపికి సపోర్ట్ చేశారు. దీంతో రాజోలు నియోజకవర్గంలో డాక్టర్ రాపాక రమేష్ బాబు మలికిపురం మండలం చింతలమోరి గ్రామ సర్పంచ్‌గా గెలిచి జనసేన పార్టీ యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. కేవలం పార్టీ రూపొందించిన కార్యక్రమాలే కాకుండా తన అనుచరుల సహాయంతో కూడా పలు కార్యక్రమాలు చేపట్టారు. కోవిడ్ సమయంలో తన సొంత ఖర్చులతో తమ సొంత స్వచ్ఛంద సంస్థ "పింక్ హార్ట్స్ ఫౌండేషన్' ద్వారా కోవిడ్ మృతులకు అంత్యక్రియలు నిర్వహించారు. కోవిడ్ సమయంలో పేదలకు నిత్యావసరాలు అందజేశారు. ఈ సేవలకు ఉమ్మడి గోదావరి జిల్లా ఎస్‌పి ద్వారా ప్రశంసలు, మానవత్వధీర బిరుదు అందుకున్నారు. గత ఏడాదిగా పలు గ్రామాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల మన్ననలను పొంది, అధినేత పవన్ కళ్యాణ్ ప్రశంసలు అందుకున్నారు. మొదట్లో తాను ఎంఎల్ఎ సీటును ఆశించి ఇదంతా చేయడం లేదని, కేవలం పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో చేస్తు న్నానని డాక్టర్ బాబు చెప్పారు. ఆయన అను చరులు డాక్టర్ ను ఎంఎల్ఎగా చూడాలని అనుకుం టున్నారు.

సమస్యలు తెలుసుకుంటోన్న రమేష్ బాబు

డాక్టర్ రమేష్ బాబు ఎంఎల్ఎ టిక్కెట్ రేసులో ఉన్నారని, స్థానికుడు కాబట్టి తమ నాయకునికి తప్పకుండా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ టికెట్ కేటాయిస్తారని రమేష్ బాబు అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీలో చేరిన నాటి నుంచి తమ నాయకుడు పార్టీలో కొంత మంది యువ కులను సంఘంగా తయారుచేసి పార్టీ ఆధ్వర్యంలో ఓటు సభ్య త్వాలు చేయించారని కార్యకర్తలు గుర్తు చేస్తు న్నారు. అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీని పటిష్ట పరిచే దిశగా జనసేన పోరాట యాత్రలో తమ నాయ కుడు పాల్గొన్నారని.. వారాహి యాత్ర కార్యక్రమాల ను దిగ్విజయంగా చేసి చూపించారని అంటు న్నా రు. తమ నాయకుడుకి జనసేన టిక్కెట్ ఇస్తే గెలిపించి పార్టీకి అంకితం ఇస్తామని కార్యకర్తలు కోరుకుంటున్నారు.

తమ ఫౌండేషన్ ద్వారా కోవిడ్ మృతులకు అంత్యక్రియలు(ఫైల్)

సీటు మాదంటే మాదంటూ ప్రచారం

అధికార పార్టీని ఓడించేందుకు పార్టీల పెద్దలు తీసుకున్న పొత్తు నిర్ణయం మంచి ఫలితాలను ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ రాజోలు నియోజకవర్గంలో మాత్రం టిడిపిలో నిరాశ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిక్కెట్ల సర్దుబాటులో గందరగోళ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అటు టిడిపి పార్టీ శ్రేణులు రాజోలు టిక్కెట్ వదిలే ప్రసక్తి లేదని చెబుతుంటే, ఇటు జనసేన శ్రేణులు రాబోయే ఎన్నికల్లో రాజోలు లో మరోసారి తమ పార్టీ జెండా ఎగరేస్తామని ప్రచారం చేసుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

గుత్తెనదీవిలో సబ్ స్టేషన్ 33కేవీ లైన్ నిర్మిస్తున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మురమళ్ల, కొమరగిరి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజి నీర్ మోకా రవి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బిక్కవోలు

ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో రంగంపేట మండలం ముకుందవరానికి చెందిన షేక్ మౌలానా(42) మృతి చెందాడని ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు మండలం కొమరిపాలెంలో ఒక రైస్ మిల్లులో మౌలానా కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం ఎప్పటిలానే కూలి పనికి వెళ్లాడు. పనిముగించుకుని ఇంటికి వెళతుండగా బలబద్రపురం శివారు మురళీమోహన్ గుడౌన్ వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఎంపిటిసి సభ్యురాలి మృతి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన టిడిపి ఎంపిటిసి సభ్యురాలు ఈజ్జపు సూర్యకళ (26) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆమె కుటుంబికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఆన తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సామాజిక సేవలతో ఔన్నత్యాన్ని చాటాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

సామాజిక సేవలతో ఔనత్యాన్ని చాటాలని కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ అన్నారు. అయినవిల్లి మండలం విలస గ్రామంలో శ్రీ కష్ణదేవరాయ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పూర్వీకులను ఆదర్శంగా తీసుకొని కాపు సామాజిక వర్గంతో పాటు సమాజానికి విద్య, వైద్య, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లోన్నూ ప్రతి గ్రామంలో సేవలందించాలన్నారు. దానికి తన వంతు సహకారం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమారాధనలో జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త మద్దా చంటిబాబు, కాపు నాయకులు నిమ్మకాయల జగయ్యానాయుడు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సరిపెల్ల కనకరాజు, మట్టపర్తి వెంకటరమణ(పండు), చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లా చిట్టిబాబు, దూడల ఫణి, ఎం.నాయుడు, కె.రాంబాబు, ఎ.దుర్గారావు, పి.ఆదినారాయణ, గంధం గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన కండేపల్లి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. పేద కుటుంబం కావడంతో ఆతని భార్య లక్ష్మి కి ఆదివారం వాడపర్రుకు నవోదయ శెట్టిబలిజ సంఘం రూ.11వేల ఆర్థిక సాయంతో పాటూ 25 కేజీల బియ్యం అందించింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, గుత్తుల బాబ్జి, మట్టపర్తి శ్రీనివాసరావు, చప్పిడి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కడలి సాయిబాబు, మట్టపర్తి సుధీర్, కముజు సాయి, మట్టపర్తి కృష్ణ, పాటి బాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి-కాకినాడ

సహకార రంగంలో కొనసాగుతున్న వ్యవస్థలన్నీ సమర్థవంతంగా పనిచేస్తున్నప్పుడే తగిన సార్థకత చేకూరుతుందని ఎపి స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ డిప్యూటీ రిజిస్ట్రార్, సహకార శిక్షణా కేంద్రం లెక్చరర్ వి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో కెసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాససత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సహకార వారోత్సవాల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో సహకార సొసైటీలు ఎలా అభివద్ధి చెందాలనే అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సహకార సంఘాలు పారదర్శకంగా పనిచేస్తూ సేవలు మెరుగుపరుచుకున్నాయన్నారు. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సహకార రంగం బలోపేతంగా ఉంటే వాటి ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. అనేక సంఘాలు స్వయం సమద్ధి సాధించి వేల నుంచి లక్ష్యాల్లో పంట రుణాలు, ఇతర ప్రయోజనాలను అందించగలుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి నరల్ మేనేజర్ జి.ప్రవీణ్‌కుమార్, కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివబాలయోగి, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితర ప్రముఖులు హాజరయ్యారు.

వైసిపి పాలనలో దళితులపై దాడులు

ప్రజాశక్తి-తాళ్లరేవు

వైసిపి పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమయ్యాయని టిడిపి ఎస్‌సి సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెల్లి అశోక్, జిల్లా అధ్యక్షుడు బొద్దింక నారాయణరావు అన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ విస్తతస్థాయి సమావేశం జక్కల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో అధ్యక్షుడు మోర్తా భైరవమూర్తి అధ్యక్షతన జైభీమ్ పేటలోని ప్రసాద్‌బాబు నివాసంలో ఆదివారం జరిగింది. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎస్‌సిలకు రావాల్సిన హక్కులను కాలరాస్తోందని, దళితులకు చెందిన 27 పథకాలను రద్దు చేసిందని, ఆ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులను రద్దు చేసి యువకులకు అన్యాయంచేశారన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకి రాకుండా ప్రతి ఎస్‌సి సెల్ కార్యకర్తా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దున్నా గౌతమ్, బీర రాజేష్, బోయిడి వేణుగోపాల్, దాసరి వేణు, వాకపల్లి చిరంజీవి, మహాలక్ష్మి, తాతపూడి నాగేశ్వరావు, దున్నా సుబ్రహ్మణ్యం, మురళీకష్ణ, వెంటపల్లి చంద్రమౌళి, ఉమామహేశ్వరి, గంటా రమేష్, గోపి, వస్కా రెడ్డి, ఐతే గోవింద్ పాల్గొన్నారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యానికి ఆవంత్స కృషి

ప్రజాశక్తి-పిఠాపురం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ రచనలు చేశారని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సూర్యరయ్య విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కళారత్న డాక్టర్ ఆవంత్స సోమ సుందర్ శతజయంతిని నిర్వహించారు. తొలుత సోమసుందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడారు. నిబద్ధత కలిగిన రచయితగా తెలుగు సామాజిక చరిత్రలో మార్పు కోసం సోమ సుందర్ రచనలు చేశారన్నారు. 82 ఏళ్ల పాటు సమసమాజ నిర్మాణం కోసం సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సాహిత్య రచన, సాహిత్య ప్రచురణ, సాహిత్య ప్రోత్సాహం ఇలా విభిన్న రంగాల్లో సోమ సుందర్ చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ మనిషిని నడిపించేది ఒకటి సైన్స్ రెండోది సాహిత్యం అని కొడవటి గంటి కుటుంబరావు అన్న మాటలను గుర్తు చేశారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంలో సోమ సుందర్ ఎంతో కషి చేశారన్నారు. సాహిత్యానికి, కళలకు నేటి యువత దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం సోమ సుందర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు అడుగులు వేయాలని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెలికాన్ స్టాలిన్ మాట్లాడుతూ మతోన్మాదంపై, సామాజిక ఉగ్మతలపై కవిత్వం ద్వారా సోమసుందర్ పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల మీద స్పందించి రచనలు చేయటం సోమ సుందర్ ప్రత్యేకత అని అన్నారు. పిఆర్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరత లక్ష్మి మాట్లాడుతూ ఆరుద్ర సాహిత్యానికి పరిచయం చేసింది సోమసుందర్ అని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు గనార కమ్యూనిస్టుగా జీవితాంతం బతికిన గొప్ప మహోన్నత వ్యక్తి సోమసుందర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సహదయ మిత్రమండలి మహిళా కార్యదర్శి పి.పావని, యువ రచయిత డాక్టర్ కిలారి గౌరి నాయుడు అభ్యుదయ గీతాలను ఆలపించారు. అనంతరం రచయిత గౌరవ్ రచించిన 'ఆకాశమంత అక్షర మూర్తి డాక్టర్ ఆవంత్స సోమసుందర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ఉపాధ్యక్షులు డాక్టర్ గజరాజు సీతారామస్వామి, సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ట్రెజరర్ మేకా మన్మధరావు, ఆవంత్స విజయ శేషేంద్ర శాతకర్ణి, గట్టి శ్రీకష్ణదేవరాయలు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, తట్టవర్తి సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షు వి సత్యనారాయణ రెడ్డి, కొండేపూడి శంకర్రావు, సతీష్, శ్రీనివాసరావు, సాహిత్య అభిమానులు, కవులు, కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అకిరా కంటి వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ కడలి ప్రసాద్

అమలాపురంలో పేరూరు వై.జంక్షన్ సమీపంలో బోసకుర్రు రోడ్డులో ఏర్పాటు చేసిన అకిరా కంటి ఆసుపత్రిని చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు కడలి ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడారు. తనకు విద్య నేర్పిన ప్రొఫెసర్ పేరుతోనే అకీర కంటి వైద్యశాలను స్థాపించానని తెలిపారు. అనంతరం ప్రసాద్ మాట్లాడారు. 37 ఏళ్లుగా కంటి వైద్యంలో అపార అనుభవంతో రాజమహేంద్రవరంలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వీటిని విజయవాడ, అమలాపురం పట్టణాలకు విస్తరించారని తెలిపారు. 13 ఏళ్ల నుంచి యునైటెడ్ నర్సింగ్ హోమ్‌లో అకిరా వైద్య సేవలు అందించారని తెలిపారు. ఇప్పుడు పేరూరులో సొంత నూతన భవనంలోకి దీన్ని మార్చారని తెలిపారు. అత్యాధునిక నేత్ర వైద్య సేవలు ఇకపై జిల్లా పరిసర వాసులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దిన మిత్రులు, కన్సల్టెంట్ ఆర్కిటెక్ అండ్ ఇంటీరియర్ డిజైనర్ వి.షణ్ముఖ తేజ, శాతవాహన ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత చెరుకూరి మురళీకృష్ణలకు చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ నీలిమ, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ హరిప్రియ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.ఇంద్రజిత్, మెడికల్ సూపరింటెండెంట్లు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

కోరంగి ప్రజల సమస్యలు పట్టించుకోండి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి విచ్చేస్తున్న మంత్రులు, అధికారులు కోరంగి పంచాయతీ ప్రజల సమస్యలను పట్టించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కోరంగి పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యలపై పలుమార్లు జిల్లా, మండల స్థాయిలోని అధికారులకు అర్జీలు పెట్టినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. కొత్త కోరంగిలో బాలయోగి కళ్యాణ మండపం వద్ద మరో వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని, సీతారాంపురంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ పైపులైను వేయాలని, నిర్మించిన వాటర్ ట్యాంకులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సీతారాంపురంలో బేస్మెంట్లు వేసిన సచివాలయం హెల్త్ క్లినిక్ భవనాలను వెంటనే నిర్మించాలన్నారు. జగనన్న కాలనీలో పట్టాదారులకు స్థలాలను అప్పగించాలి. కోరంగి గ్రామంలో సర్వే నంబర్ 276/1 నుంచి 276/31 వరకు సుమారు 60 ఎకరాల అసైన్ భూమిని పేదలకు పంచాలన్నారు. అదే గ్రామంలో 402/1 సర్వే నంబరు వృద్ధాశ్రమం పక్కనగల సుమారు నాలుగున్నర ఎకరాలు గ్రామకంఠం భూమిని, కోరంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గరలో ఉన్న సుమారు రెండు ఎకరాల గ్రామకంఠం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలన్నారు. పాత కోరంగి హౌరా వంతెన నుంచి కోరంగి పెద్ద వంతెన వరకు ఫార్మసీ కాలేజ్ వెనుక భాగం నుంచి మాజీ ఎంఎల్ఎ మండపేట చౌదరి చెరువుల వరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేయించి పేద ప్రజలకు ఇవ్వాలని ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

చరిత్రలో ఆలమూరుకు ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-ఆలమూరు

పుస్తక సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

చరిత్రలో ఆలమూరుకు స్థానం ప్రత్యేకమైనదని, తెలుగు సాహిత్యంలో, ఆధ్యాత్మికంగా, రాజకీయంగా గానీ, చారిత్రాత్మకంగా ఆలమూరుకున్న విశిష్టతలు ఎనలేనివని, అవన్నీ భావితరాలకు అందేలా నేటితరం కృషి చేయాలని దూరదర్శన్ రిటైర్డ్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, ప్రముఖ రచయిత సత్యవోలు సుందర సాయి అన్నారు. మండల కేంద్రానికి చెందిన 14 మంది రచయితల కథలతో రచయిత గొడవర్తి శ్రీనివాసు సంకలనం చేసిన 'ఆలమూరోళ్ల కథలు' సంపుటి స్థానిక గ్రామ దేవత రావులమ్మ అమ్మవారికి అంకిత కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యవోలు సుందరసాయి, ప్రముఖ కవి, శతక కర్త కామవరపు మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలమూరు చరిత్రలో కవులు, కథా రచయితలతో పాటు, ఎందరో ప్రముఖులు ఉన్నారన్నారు. వారందరి గురించి మరింత సమాచారం సేకరించి మరొక పుస్తక రూపంలో తీసుకొస్తే బాగుంటుందని సుందర సాయి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ నాతి లావణ్య, కుమార్‌రాజా దంపతులు ఆలమూరు ఖ్యాతిని వివరించారు. కామవరపు మల్లికార్జునరావు మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా ప్రముఖుల వివరాలు సేకరించి ఒక పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. తన శిష్యుడు గొడవర్తి శ్రీనివాసు దీనికి బాధ్యత వహించడం తనకు మరింత ఆనందదాయకంగా ఉందన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు నిర్వాహకులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, గాయకులు పెండ్యాల సుబ్బారావు, వుడతా వెంకటేశ్వర్లు, వాసా వెంకట దుర్గాప్రసాద్, కే.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్ర ప్రగతి : ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

పార్టీలో చేరిన వారితో ఎంఎల్ఎ చినరాజప్ప

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. వికె రాయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ రాయపురం ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ వార్డ్ సభ్యులు సహ వందలాది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరందరికీ పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. అనంతరకాయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో ప్రకటించిన తొలి మేనిఫెస్టోలోని ఐదు పథకాలు అత్యద్భుతంగా ఉన్నాయన్నారు. వీటిపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లోనూ నష్టపోయిందన్నారు. మళ్లీ రాష్ట్రం ప్రగతి పథాన పయనించాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కాకినాడ పార్లమెంటరీ తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులచౌదరి, మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, కుర్రా నారాయణ స్వామి(రాజు), క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ సతీష్‌కుమార్‌కు సన్మానం

తాళ్ళరేవు : మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా దడాల సాల్మన్ రాజ్ (శ్రీనివాసరావు)ను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి సామ్యూల్ సాగర్‌ను ఆదివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. జెడ్‌పిటిసి సాగర్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ మండల అధ్యక్షునిగా నియమితులైన సాల్మన్ రాజును ఎంఎల్ఎ పొన్నాడ అభినందించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రిస్టియన్ల అభివద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పంపన జాన్ ప్రసాద్, మల్లాడి అప్పారావు, దడాల మహేంద్ర విజయ్ కుమార్, విక్టర్, డేవిడ్ రాజు, జాన్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లికి జయహో జగన్ యాత్ర

గండేపల్లి: ఎంఎల్‌సి రఘురాజు చేపట్టిన జయహో జగన్ యాత్ర ఆదివారం నీలాద్రిరావుపేటకు చేరుకుంది. వీరికి జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఘన స్వాగతం పలికారు. సంఘీభావంగా కొంత దూరం పాదయాత్ర చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్ మళ్లీ సిఎం కావడం ముఖ్యమన్నారు. ఎంఎల్ఎ రఘురాజు శ్రీకాకుళం నుంచి సుమారు 800 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రతి కుటుంబానికి రూ.లక్షల మేర సాయం అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రఘురాజు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రతి గ్రామంలో ప్రతి నియోజకవర్గంలో ప్రజలు నాయకులు సంఘీభావం తెలపడం జగన్మోహన్ రెడ్డి గెలుపునకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కందులు చిట్టిబాబు, ఒబిన్ని వీరబాబు, బండారు రాజా, ఒమ్మి రఘురాం పాల్గొన్నారు.

వినోదాత్మకంగా 'ఐ హేట్ లవ్'

ప్రజాశక్తి-అమలాపురం

వినోదాత్మకంగా ఐ హేట్ లవ్ సినిమాను నిర్మించామని దర్శకుడు వెంకటేష్ తెలిపారు. కోనసీమ ప్రాంతంలో మారుమూల గ్రామమైన నేదునూరులో రావి ఫౌండేషన్ ద్వారా ఉత్తమ వైద్యం, ఉన్నత విద్య ఉచితంగా అందిస్తూ నైపుణ్యం కలిగిన యువతను ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నారు డాక్టర్ రవిబాల. ఇప్పుడు డాక్టర్ రవి బాల ప్రొడక్షన్స్ బ్యానర్ స్థాపించి నేదునూరు గ్రామవాసి వెంకటేష్‌కు దర్శకునిగా 'ఐ హేట్ లవ్' 'నేను ప్రేమలో పడ్డాను' ట్యాగ్‌లైన్‌తో సినిమాను నిర్మించారు. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఆదివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సినిమా నటీనటులు దర్శకులు నిర్మాత ఇతర సాంకేతిక పాల్గొన్నారు. కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలతో చక్కని కథలో అమర్చి మంచి సినిమా చూశాను అనే భావన ప్రేక్షకుల్లో కలిగించేలా వినోదాత్మకంగా మలిచామని దర్శకులు వెంకటేష్ తెలిపారు. ప్రేక్షకునికి మంచి రుచికరమైన కోనసీమ విందు భోజనం చేసిన అనుభూతి కలుగుతుందన్నారు. ఈ చిత్రం ద్వారా సుబ్బు, శ్రీవల్లి హీరో హీరోయిన్లగా పరిచయం అవుతున్నారు. పెద్దపల్లి రోహిత్ (పిఆర్) సంగీతాన్ని అందించారు. జబర్దస్త్ హాస్యనటులు తదితరులు ఈ చిత్రంలో నటించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు తేజ, భద్రాజీ, త్రిమూర్తులు స్టిల్ ఫోటోగ్రఫీ డిజిటల్ రవి, స్వామి వివేకానంద యువత సభ్యులు రాము, కృష్ణ, ముఖేష్, బద్రి, వెంకటేష్, నాగేశ్వరావు, పవన్ అర్జున్, చరణ్, కౌశిక్, పవన్ తేజ, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు భరోసా

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సహకార సంఘాలు రైతన్నల ఆర్థిక భరోసా కేంద్రాలని పిఎసిఎస్ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో 70వ సహకార వారోత్సవాలను పురస్కరించుకొని పథకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సహకార వ్యవస్థ ప్రారంభించి 70 ఏళ్ల కాలంలో లక్షలాది మంది రైతులకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ సహకార అధికారి జివిఎన్‌వి.ప్రసాద్, సిఇఒ జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దాసరి రమేష్, సిరిపరపు రాజేష్, కర్రి పోల రామాంజనేయులు, ఎర్రబుల్లి వీర్రాజు, వైసిపి నాయకులు బదిరెడ్డి గోవిందబాబు, జువ్విన వీర్రాజు, బుద్ధ సూర్య ప్రకాష్, సూతి వీర కృష్ణప్రసాద్, సహకార సంఘం ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ ఉన్నారు.

యానాం వార్తలు

ఫైనల్ మ్యాచ్‌కోసం స్క్రీన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

భారత్ మూడోసారి ప్రపంచ కప్పు గెలవాలని ఆశిస్తూ యానాంలో స్థానిక ఎంఎల్ఎ కార్యాలయం, కనకాల పేట, కొత్తపేట, తోట వారి వీధి తదితర గ్రామాల్లో ఆదివారం భారత్ - ఆస్ట్రేలియా మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఈ ప్రపంచ కప్‌లో అన్ని మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించిందని, అదే స్ఫూర్తితో కప్పు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి - యానాం

స్థానిక సర్వేపల్లి రాధాకష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20 నుంచి 22 వరకూ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నేషనల్ వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వరుగు భాస్కరరెడ్డి తెలిపారు. కళాశాల సెమీనార్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ మునిస్వామి, అన్నవరం సత్యవతి దేవి(ఎఎస్ఒ) మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనంతలక్ష్మి పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషను చక్కగా మాట్లాడటం, అర్థం చేసుకోవడం, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో వాటిపై అవగాహన కలిగించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలని తెలిపారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ కురసాల కన్నబాబు

దేశ నిర్మాణంలో అంబేద్కర్‌ది కీలకపాత్ర

ప్రజాశక్తి -కరప

దేశ నిర్మాణంలో అంబేద్కర్ కీలక భూమిక పోషించి భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఆయన అగ్రగన్యుడుగా నిలిచారని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నడకుదురు గ్రామంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, గ్రామంలో తులసి నగర్‌లో రూ.90 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంక్, ఇంటింటికి కుళాయి కనెక్షన్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అంబేద్కర్ రాజ్యాంగం వల్లే నేడు హక్కులను పొందగలుగుతున్నామన్నారు. మహిళల హక్కుల కోసం మంత్రి పదవిని వదులుకున్న మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, సర్పంచ్ దేగల లలితకుమారి, ఎంపిటిసి సభ్యులు బుచ్చిరాజు, పైలా రామతులసి, జవ్వాది సతీష్, సోని, చంద్రరావు, ఎం.గోవిందు, పాస్టర్ రాజకుమార్, సవిలే రాజేష్, సాదే రాఘవులు, సర్పంచ్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పులిమేరులో నంది విగ్రహం ప్రతిష్టాప

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం పులిమేరులోని గ్రామ సచివాలయం సమీపంలో ఆదివారం మాజీ సర్పంచ్ తుమ్మల సూర్య కష్ణమూర్తి దంపతులు నంది విగ్రహాన్ని ప్రతిష్టాపించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల నాని, బుల్లయ్య, దాడి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం ఈనెల 20న పులిమేరులో సాయిబాబా గుడి వద్ద కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహిస్తున్నట్లు తుమ్మల నాని తెలిపారు.

రానున్నది సంకీర్ణ ప్రభుత్వమే...

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్నది టిడిపి, జనసేనల సంకీర్ణ ప్రభుత్వమేనని మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. రామవరంలో పలువురు టిడిపిలో చేరారు. రామవరం మాజీఉప సర్పంచ్ అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారు టిడిపిలో చేరారు. జ్యోతుల నెహ్రూ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి, జనసేన కలయికతో ఆంధ్ర రాష్ట్రానికి ఒక నూతన వరవడితో పరిపాలన అందించేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ అనేక మంది వైసిపిని వీడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - మండపేట

స్థానిక శ్రీ జవహర్ లాల్ మున్సిపల్ హై స్కూల్ 1990-91బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏడిద శివార్లలో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన బాల్య మిత్రులందరూ ఒక్కచోట సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి తీర్మానించారు. తక్షణ సాయంగా ఇటీవల మృతి ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గనిశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా వంక వరశేఖరప్రసాద్, ఉపాధ్యక్షులుగా గండి స్వామిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి సూర్యభాస్కరరావు, కోశాధికారిగా కనపర్తి సుబ్రహ్మణ్యం కార్యవర్గ సభ్యులుగా పసలపూడి మధు సూదనరావు, పిట్టా రాజుబాబు, ఇల్లురి సుందర రాజు, మందపల్లి చంద్ర శేఖర్, మల్లువలస గణపతి, లీగల్ అడ్వైజర్‌గా వంక సురేష్‌లను ఎన్నుకొన్నారు.

సత్యవేణికి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట రెండవ వార్డుకు చెందిన కాకరపల్లి సత్యవేణి జగనన్న ఇంటి స్థలం ఇచ్చినా, గృహ నిర్మాణానికి అధికారులు సహకరించడం లేదని తక్షణమే ఆమెకు న్యాయం చేయాలని ఆదివారం సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు పలు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సమస్యపై పలుమార్లు జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ ఇంటి స్థలాన్ని ఆక్రమించాడని, తక్షణమే చర్యలు తీసుకుని బాధితురాలు న్యాయం చేయాలన్నారు. లేకుంటే పలు సంఘాలతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు రాయుడు మోజెష్ బాబు, సందీప్ రాజు, కౌన్సిలర్ పితాని కృష్ణ, మాల మహానాడు నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కి సమస్యను వివరిస్తున్న పలు సంఘాల నాయకులు